క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్

దాచేపల్లి: జాతీయ లోక్అదాలత్ శనివారం గురజాల న్యాయస్థానం భవన సముదాయంలో నిర్వహించనున్నట్లు నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయలోక్ అదాలత్లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఏడో షరగత్తు



పిడుగురాళ్ల: పట్టణంలోని మాయాబజారులోని పీర్ల చావిడిలో గురువారం రాత్రి మోహర్రం ఏడో షరగత్తు నిర్వహించారు. తొలుత పీర్ల చావిడి ముందు ఉన్న నిప్పుల గుండంలో పెద్ద పెద్ద కట్టెలతో గుండం ఏర్పాటు చేశారు. మేళతాళాలతో నిప్పుల గుండం చుట్టూ తిరిగారు. అర్ధరాత్రి పీర్లను పీర్ల చావిడి వద్ద ఉంచారు. పీర్ల పండగని తిలకించేందుకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. మొక్కులు తీర్చుకునే భక్తులు పీర్లకు వెండి వస్తువులు వంటివి తయారు చేసి బహుకరించి వారి భక్తిని చాటుకున్నారు.

నేడు క్రీస్తు లూథరన్ చర్చి వార్షికోత్సవం



దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లిలోని క్రీస్తు లూథరన్ దేవాలయం ఐదో వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు పాస్టర్ గనుపల్లి శ్యాంప్రసన్న కుమార్ శుక్రవారం తెలిపారు. చర్చి ప్రతిష్ఠ జరిగి ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలతో పాటు వాక్యోపదేశాన్ని కూడా అందించనున్నామని ఆయన తెలిపారు. చర్చి వార్షికోత్సవ ప్రార్థనలో కేసానుపల్లి గ్రామంతో పాటు ఆసక్తి ఉన్న విశ్వాసులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

రైతులు పంట బీమా నమోదు చేసుకోవాలి

మాచర్ల: రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో చేరాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పాపకుమారి కోరారు. శుక్రవారం బీమాపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంటలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. పత్తి పంటకు ఎకరానికి రూ.1,900 చెల్లిస్తే రూ.38 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఆన్లైన్లో నమోదు చేసుకోవానికి జూలై 15వ చివరి తేదీగా తెలిపారు. పట్టాదార్ పాస్‌పుస్తకం, రైతు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పంట నమోదు ధ్రువీకరణ పత్రం, కౌలు రైతులు అయితే కౌలు ధ్రువీకరణ పత్రాలతో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండలం లింగంగుట్ల వద్ద రాష్ట్ర రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన డ్రైవర్‌ను చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రిఫర్ చేశారు. ప్రమాద సమయంలో అతను ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించి హర్షవర్ధన్ భార్య రోజా రాణి చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై శిక్షణ

క్రోసూరు: ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై ఆరోగ్య విస్తరణ అధికారులకు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, ఆరోగ్య కేంద్రం సిబ్బందికి జిల్లా కన్సల్టెంట్ ఎన్సీడీ ఆధ్వర్యంలో శుక్రవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ కుమార్ మాట్లాడుతూ ఫ్లోరైడ్ భూగర్భ జలాలు, నదీ జలాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, టీ, కాఫీ, పారిశ్రామిక వ్యర్థాలు, టూత్ పేస్ట్‌లలో ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లోరోసిస్ రెండు రూపాల్లో వస్తుందని.. మొదటిది డెంటల్ ఫ్లోరోసిస్.. ఇది ప్రధానంగా పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. ఇందులో ఆరేళ్లలోపు పిల్లల దంతాలు పసుపు రంగులోకి మారటం ప్రారంభమవుతుందన్నారు. రెండవది స్కెలిటల్ ఫ్లోరోసిస్.. ఇది శరీరంలోని కీళ్లను ప్రభావితం చేస్తుందన్నారు. 6 నుంచి 16 సంవత్సరాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఫ్లోరోసిస్ టెస్టులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు షాద్, సిరిచందన, రాంబాబునాయక్, ఆరోగ్య విస్తరణాధికారులు శిఖా శ్యాంసన్, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

చినుకు రాలదు.. సాగు సాగదు..

- ముఖం చాటేసిన రుతుపవనాలు
- నిరాశాజనకంగా సాగుతున్న ఖరీఫ్



విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉంచిన పొలం

గురజాల: ఖరీఫ్ ముంచుకొచ్చింది. జూన్ ప్రారంభంలోనే రుతుపవనాలు వచ్చాయి. అడపదడపా వర్షాలు పడ్డాయి. వేసవి దుక్కులు పూర్తి చేసుకున్నారు. రుతుపవనాలపై ఆశలతో రైతులు సాగుకు ఉపక్రమించారు. అయితే నైరుతి ముఖం చాటేసింది. ఏ మాత్రం ప్రభావం చూపకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా పల్నాడు ప్రాంతంలో ఖరీఫ్ సాగు నిరాశాజనకంగా సాగుతోంది.

కేవలం పత్తి సాగుకే పరిమితం

పల్నాడు ప్రాంతంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో ఇప్పటి వరకు కేవలం పత్తి సాగుకే పరిమితమైయ్యారు. నియోజకవర్గంలో 20 వేల హెక్టార్లుకు పైగా సాగు చేయాల్సి ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కేవలం ఇప్పటి వరకు గురజాల 1200 హెక్టార్లు, దాచేపల్లి 500 హెక్టార్లు, మాచవరం 200 హెక్టార్లు, పిడుగురాళ్ల 600 హెక్టార్లు, కారంపూడి 1500 హెక్టార్లు మాత్రమే సాగు చేశారు. 20 వేల హెక్టార్లుకు గాను కేవలం ఇప్పటి వరకు 4 వేల హెక్టార్లు మాత్రమే సాగు చేశారు. వరి, మిరప, అపరాలు వంటి సాగు ఇంకా ప్రారంభం కాలేదు.

వర్షపాతం నమోదు ఇలా...

వర్షపాతం నమోదు చాలా తక్కువగా నమోదైంది. మే నెలలో పది రోజులు వర్షం కురవగా కేవలం 4 రోజులు మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు అయింది. ఈ 4 రోజులకు గాను కేవలం 72.2 మీల్లి మీటర్లు, జూన్ నెలలో కేవలం 4రోజులు వర్షం కురిసింది ఈ నాలుగు రోజులకు గాను 30.4 మీల్లి మీటర్లు, జూలైలో ఒక రోజుకి 3.5 మీల్లీ మీటర్లు మాత్రమే వర్షపాతం నమోదు జరిగినట్లు ఆయా శాఖ అధికారులు వెల్లడించారు. కనీసం పది రోజులు కూడా వర్షం కురవలేదు. దీంతో రైతులు విత్తు నాటేందుకు వెనకాడుతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీఎం రంగాకు ఘన నివాళి

మాచర్ల: దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎరబోతుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్ పాల్గొన్నారు. మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆశ్రమంలో...

గురజాల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని శ్రీ అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం కాపు సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహన్ రంగా జయంతి నిర్వహించారు.

దుర్గి మండలంలో...

దుర్గి: దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకుని రంగా విగ్రహానికి ఘనంగా పూలమాల వేసి నివాళులర్పించారు. పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోటకూర వెంకటనర్సయ్య, చలమయ్య, ఉప్పు శ్రీను, కటకం భవన్నారాయణ, పగడాల కృష్ణయ్య, కటకం కోటయ్య, వీరమల్ల చంద్రమౌళి, ఉప్పు గోపాల రావు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం



నారాయణపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహనీయులకు నివాళులర్పిస్తున్న నేతలు

దాచేపల్లి: మహనీయుల ఆశయాలను సాధించాలని దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య అన్నారు. అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన్ రంగా, కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాలను నారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. నేతల చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పట్టణ కన్వీనర్లు కోటా కృష్ణ, షేక్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, ఎంపీపీ కందుల జాను, మాజీ సర్పంచి మందపాటి రమేష్ రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు షేక్ ఖాదర్ భాష, కొమెరబత్తిని విజయకుమార్, కౌన్సిలర్లు వందనపు వెంకటరామయ్య, నగుబండి గురువులు, చాట్ల క్రాంతి కుమార్, మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, నాయకులు దేవళ్ళ రఘు, గరిణే పుల్లారావు, జక్కా అశోక్, మునగా శ్రీనివాసరావు, జంగాల సింగరయ్య, రామారావు, ముంద్రా శ్రీనివాసరావు, పాపా, సైసావలి, వలి పాల్గొన్నారు.

అల్లూరి జీవితం యువతకు ఆదర్శం



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పూలమాలలు వేస్తున్న దృశ్యం

రెంటచింతల: అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు ఆదర్శమని హెచ్ఎం నాగేశ్వరరావు నాయక్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వర స్వామి మాణ్యం కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు ఓరుగంటిమారుతీ శర్మ తన తల్లిదండ్రులు భాస్కరరావు, విశాలక్ష్మి జ్ఞాపకార్థంగా సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఓరుగంటి మారుతీ శర్మ పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్య చిరస్మరణీయుడు



పిడుగురాళ్లలో రోశయ్య కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: దివంగత కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతా వెంకట రామారావు పేర్కొన్నారు. రోశయ్య జయంతిని పురస్కరించుకొని జానపాడు రోడ్డులోని రోశయ్య విగ్రహానికి శుక్రవారం పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి, మాజీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎస్సీ, బీసీ కన్వీనర్లు కాలే మాణిక్యరావు, కందులూరి శివయ్య, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, కొక్కెర శ్రీను, సైదావలి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

మాచర్ల: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న రోశయ్య విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే యరపతినేని

గురజాల: నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులు, పెండింగ్ పనులపై ఆరా తీశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని గమనించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, నగర పంచాయతీ చైర్ పర్సన్ షేక్‌బడేజానీ, టీడీపీ మండల కన్వీనర్ జె.లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు, ఎస్.హనుమంతరావు, ఎన్.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

భావితరాలు సీతారామరాజు స్ఫూర్తితో మెలగాలి..



మాచర్ల రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని భావి తరాలకు అందించాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మన్యం పౌరుల కోసం బ్రిటీషు పాలకులకు ఎదురుతిరిగి చేసిన పోరాటం తెలుగుజాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీటీ షేక్ బాషా, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, వీఆర్ఓలు ఆరుముళ్ల నాగేశ్వరరావు, జలీల్, ఖాజావలి, ప్రశాంతి, రవికుమార్, అంజి, భాస్కర్ పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

మాచర్ల: స్థానిక చక్రధార్ డిగ్రీ కళాశాలలో దివంగత పిన్నెల్లి వెంకయ్య వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. స్వామి వివేకానంద, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుర్రి సాయిమార్కొండేయ రెడ్డి, డైరెక్టర్ మహేష్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు చక్కా గురవయ్య, వెంకటేష్, రాణి, లక్ష్మీప్రసన్న, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో డెంగీ నివారణ సాధ్యం



గన్నవరంలో అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారులు లక్ష్మయ్య, మురళీమోహన్

మాచర్ల రూరల్: పరిసరాల పరిశుభ్రత ద్వారానే అంటువ్యాధులు నివారించవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి డి.లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు, గన్నవరం గ్రామాలలో డెంగీ మాసోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడారు. కట్టెదోమ ద్వారానే డెంగీ వ్యాధి ప్రబలుతుందని, నీరు నిల్వ లేకుండా చూసుకొని, ముఖ్యంగా కాలువలో పూడికతీత పనులను చేపట్టి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను పరిశీలించి శుభ్రపరుచుకోవాలని కోరారు. విడవకుండా జ్వరం వస్తే సంబంధిత అధికారులను సంప్రదిస్తే వెంటనే నివారణకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాలలోని బావిలలో బ్లీచింగ్, ఫ్లోరిన్‌ను పరిశీలించారు. అనంతరం డెంగీ నివారణకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.మురళీధర్, ఏఎన్ఎంలు ప్రసన్న, దీనమ్మ, బి.సైదయ్య, శైలజ, సత్యానంద్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో అవగాహన అవసరం



ప్రమాదాల నివారణ పై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు

మాచర్ల రూరల్: పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు కార్మికులు, యాజమాన్యం పరస్పరం అవగాహన కలిగి పనిచేయాలని డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్స్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు కోరారు. శుక్రవారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదాల నివారణపై కార్మికులతో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీలలో ప్రమాదాలు నివారించేందుకు సేఫ్టీ విధానాలపై కార్మికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, అలాగే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఎలా స్పందించాలి. నివారణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీ అధికారి తెనాలి రాజు, కేసీపీ సిమెంట్ యూనిట్ జనరల్ మేనేజర్ వి.వెంకట రమణ, హెచ్ఆర్ హెడ్ ఉదయ్‌కుమార్, హెచ్ఓడీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

మాచర్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలీస్ రిసోర్స్‌పర్సన్ ప్రదీప్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కాలేజి, కృష్ణ వేణి జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ క్రైమ్‌కు గురైన బాధితులు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల నుంచి జాగ్రత్తగా ఏవిధంగా ఉండాలనే విషయాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. సైబర్ క్రైమ్ విభాగంలో ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు ఆసక్తి కలిగే విధంగా తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ యనమదల వెంకట్రామయ్య, డైరెక్టర్ సుబ్బారావు, ఎస్ఐ సంధ్యారాణి, ఏఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

పిడుగురాళ్ల: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆర్టీసీ డిపో వద్ద ఎర్రబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ వెంటనే విడుదల చేయాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పదివేల మందిని ప్రభుత్వం వెంటనే నియమించాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీనే సొంతంగా కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం డిపోలను ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సును ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని, అలాగే పలు రకాల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ పబ్లిసిటీ సెక్రటరీ షేక్ దస్తగిరి, జిల్లా చీఫ్ ప్రెసిడెంట్ ఓ సుశీల, జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్ అమీర్ హమ్జా, జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ వరప్రసాద్, డిపో సెక్రటరీ బంగారు శ్రీనివాసరావు, ట్రెజరర్ సీహెచ్ రామారావు, గ్యారెజ్ అధ్యక్షులు రాజారావు పాల్గొన్నారు.

ఇది పార్కింగ్ స్థలం కాదులే!



రెంటచింతల బస్‌స్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

బస్‌స్టాండ్‌ను కొందరు పార్కింగ్ స్థలం చేసేశారు. ఆవరణలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవు. ప్రాంగణం అపరిశుభ్రంగా ఉంది. ప్రయాణికులకు ఏర్పాటు చేసిన బస్‌స్టాండ్‌ను ద్విచక్ర వాహనాలతో నింపేశారు. ప్రయాణికులు, ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌ల కోసం ఎక్కడ ఉండాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. బస్‌స్టాండ్‌లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. - రెంటచింతల

వైద్యవిద్యను పేదలకు దూరం చేశారు

- పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను వెంటనే పూర్తిచేయాలి
- పీఆర్ కోసం ఆందోళన చేస్తున్న వైద్యవిద్యార్థులపై లాఠీచార్జి అమానుషం
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకులు వెల్లడి



మాట్లాడుతున్న ఆకాష్, మనోహరరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వం ద్వారా వైద్యవిద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు అందకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాశవికంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చి, సుమారు రూ.2,800 కోట్ల వ్యయంతో వాటి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారన్నారు. అందులోని ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించడం కూడా జరిగిందని అన్నారు. మిగతా 12 మెడికల్ కళాశాలలు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా ఆపేసిందన్నారు. వీటన్నింటిని ఇప్పుడు ప్రైవేటు పరం చేసి తన అనుమాయులకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పూర్తిచేసిన ఐదు మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకురాకపోవటం వలన గడిచిన ఏడాదికాలంలో సుమారు 1200 మెడికల్ సీట్లు కోల్పోవటం జరిగిందన్నారు. దీని వలన వైద్యవిద్యను అభ్యసించాలనుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆశాభంగం నెలకొందన్నారు.

పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను రూ.500 కోట్లతో నిర్మాణం చేపట్టి కళాశాల నిర్మాణం 60 శాతం, హాస్పిటల్ నిర్మాణం 90 శాతం పూర్తిచేశారన్నారు. మరికొద్ది నిధులతో హాస్పిటల్ నిర్మాణం పూర్తిచేస్తే వెనుకబడిన పల్నాడు ప్రాంతమైన గురజాల, మాచర్ల వాసులకు 300 పడకల ప్రభుత్వ వైద్యశాల అందుబాటులోకి వచ్చి ఉండేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో కనీసం 10 శాతం కూడా పనులు చేయకుండా, ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని విమర్శించారు. తక్షణమే వైద్యశాఖ మంత్రి సత్యకుమార్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పునరాలోచన చేసి మిగిలిన 12 మెడికల్ కళాశాల ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకొని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. దివంగత వైఎస్సార్ మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ కల్పించటం వలన ఎంతోమంది బడుగు బలహీన వర్గాలకు చెందిన వేలాదిమంది డాక్టర్లు అయ్యారన్నారు. నరసరావుపేట మండలంలోని చిన్నతురకపాలెం గ్రామంలో 33 మంది డాక్టర్ పట్టా పుచ్చుకొని పేదలకు వైద్య సేవలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కానీ ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఆ విద్యను నీరుగార్చి దళితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్యను అందనీయకుండా అన్యాయం చేస్తుందని అన్నారు.

వైద్య విద్యార్థులపై లాఠీచార్జి దారుణం

డాక్టర్స్ డే నాడు వైద్య విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చేసిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదికాలంగా విదేశాల్లో వైద్యవిద్యను పూర్తిచేసిన విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబరు అందజేస్తామని చెప్పిన ఈ కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాటమార్చి నేషనల్ మెడికల్ కౌన్సిల్ దగ్గరికి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని చెప్పడం అన్యాయమన్నారు. దీనిపై ఆందోళన చేస్తున్న వారిపై ప్రభుత్వం పాశవికంగా దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే వాళ్లకు పీఆర్ అందజేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి విభాగ నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు వై.విజయ మనోహరరెడ్డి, నాయకులు ఉప్పుతోళ్ల వేణుమాధవ్, షేక్ ఖాసీంషరీఫ్, షాయబ్, జిలాని, నాగూర్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే జ్వరాల నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.రవి

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.రవి పేర్కొన్నారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉన్నవ గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్‌తో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం అమలు తీరును వారు పరిశీలించారు. దోమల నిర్మూలన, గ్రామ పరిసరాల పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూ జ్వరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం అమలులో మెరుగుదల కోసం వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.భరద్వాజ, సీహెచ్‌వో ఎస్.పున్నారావు, మేల్‌ఎంపీహెచ్ఎస్ వడ్లాన రాజశేఖర్, ఉన్నవ గ్రామ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

• రేషన్ స్వాధీనం

ముప్పాళ్ల: మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ట్రక్కులో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఫిరంగిపురం మండలంలోని బేతపూడికి చెందిన మొహిద్దీన్‌పీరా బియ్యాన్ని సేకరించి తరలిస్తూ ఉంటాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్ఐ తెలిపారు.